సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 18 । నవంబర్ । 2023



చవితి శోభ

విజయనగరం జిల్లా ప్రజలు నాగులచవితి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఇంటిల్లపాదీ కొత్తదుస్తులు ధరించి పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. - 8లో



అదిగదిగో ఉపాధి - 8లో

ఎస్.కోట పట్టణంలో పారిశ్రామిక ఉపాధికి బాటలు పడుతున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.



ఇదెక్కడి చోద్యం

విజయనగరం సర్వజన ఆస్పత్రికి 108లో తీసుకొచ్చిన రోగిని ఓ ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుడు బలవంతంగా ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లిపోయాడు. - 8లో

న్యూస్‌రీల్

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండలో త్వరలో నిర్వహించనున్న పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గౌరవ వేతనంపై పనిచేయడానికి సూపర్‌వైజర్ ఒక పోస్టుకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలన్నారు. పంప్‌బాయ్ 7 పోస్టులకు ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మందస, మెళియాపుట్టి, కంచిలి, సోంపేట, పలాస, టెక్కలి, నందిగాం, జలుమూరు, బూర్జ, లావేరు, సురుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన పరిసర గ్రామాల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు ఈ నెల 27లోగా ఐటీడీఏలోని పరిపాలనాధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

మళ్లీ వచ్చిన ఏనుగులు



కురుపాం-మాదలింగి రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు



భామిని: ఖాజీపురం సమీపంలోని పత్తి పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: మండలంలోకి మళ్లీ ఏడు ఏనుగుల గుంపు ప్రవేశించింది. కురుపాం నుంచి మాదలింగి వెళ్లే ప్రధాన రోడ్డుపై శుక్రవారం సంచరించాయి. వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

భామినిలో...

భామిని: మండల కేంద్రం సమీపంలోని ఖాజీపురం గిరిజనగూడకు చెందిన పత్తి పొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఏబీ రోడ్డుకు దగ్గరగా ఉన్న పొలాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

జేపీఎస్ శిబిరాలతో ఆరోగ్య భరోసా

- ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- జిల్లాలో 292 వైద్యశిబిరాల నిర్వహణ
- వేలాదిమందికి వైద్యపరీక్షలు, మాత్రల పంపిణీ
- 2,528 మందికి ఆరోగ్యశ్రీ సేవలకు సిఫార్సు



సీతానగరంలో నిర్వహించిన జేఏఎస్ శిబిరంలో మహిళ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

పార్వతీపురంటౌన్:

పేదల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమం నిర్వహించింది. మారుమూల గ్రామాలకు వైద్యనిపుణులు, వైద్యులు, సిబ్బందిని పంపించి సేవలందించింది. ప్రతి ఇంటినీ సర్వే చేయించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను నమోదుచేయించింది. వీరందరికీ జేఏఎస్ శిబిరాల్లో ఆయుష్షును పెంచేలా వైద్య అందించి, ఆరోగ్యభరోసా కల్పించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఊరూరా నిర్వహించిన జేఏఎస్ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. 292 వైద్యశిబిరాల్లో 1,39,172 మంది వైద్యసేవలు పొంది ఉచితంగా మందులు అందుకున్నారు. మరింత మంది వివిధ వైద్య, ఆరోగ్య సేవలు పొందారు.

జిల్లాలో జేఏఎస్ వైద్యసేవలు ఇలా...	
మండలాలు	15
నిర్వహించిన జేఏఎస్ వైద్యశిబిరాలు	292
అందించిన వైద్యసేవలు	1,39,172
స్పెషలిస్టు వైద్యసేవలు	54,789
సాధారణ ఓపీలు	82,927
సుగర్ టెస్టులు	13,961
హైపర్‌టెన్షన్ (బీపీ)పరీక్షలు	22,024
గర్భిణులకు అందించిన వైద్యసేవలు	2,984
బాలింతలు అందించిన వైద్యసేవలు	1,666
అనిమియా	2,713
ల్యాబ్ టెస్టులు	74,863
ఈసీజీ పరీక్షలు	3,212
ఉన్నత వైద్యానికి రిఫర్ చేసిన కేసులు	2,528

సెప్టెంబర్ 15న ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. 5,421 మంది వలంటీర్లు, 282 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 370 మంది ఏఎన్ఎంలు, 1,342 మంది ఆశ కార్యకర్తలు సుమారు 3,72,580 ఇళ్లకు వెళ్లి 1,70,609 మందిని ఆరోగ్య సర్వే చేశారు. స్మార్ట్‌ఫోన్లు ఉన్న వారితో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్ డౌన్లోడ్ చేయించారు. బీపీ, మధుమేహం వంటి ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దే చేశారు. అనారోగ్య సమస్యలు ఎదు ర్కొంటున్న వారికి టోకెన్లు ఇచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు హాజరు కావాలని సూచించారు.

ముగిసిన వైద్యశిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభమైన వైద్య శిబిరాలు ఈ నెల 17తో ముగిశాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళికతో శిబిరాలను విజయవంతంగా నడిపించారు. శిబిరాల నిర్వహణకు స్పెషలిస్టు డాక్టర్లతో పాటు 89 మంది ప్రభుత్వ వైద్యులను కేటాయించారు. వారు విలేజ్ హెల్త్ క్లినిక్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు కొనసాగాయి. కార్పొరేట్ తరహాలో రోగుల వివరాలను పొందుపరిచేందుకు కేస్ షీట్‌లు ఇచ్చారు.

ఊరి చెంతనే మెరుగైన వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్షతో పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఊరిచెంతనే ఉచిత వైద్యసేవలు పొందారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వాడవాడలా శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం అందించడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి, శస్త్రచికిత్సలు చేయించారు. అర్హులైన వారికి వైఎస్సార్ ఆసరా కింద రూ.5 వేలు అందజేశారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం



పేదలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కొత్త ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పల్లెలకు డాక్టర్లు రావడం ప్రజలు గొప్పవరంగా భావిస్తున్నారు. నెలన్నర రోజుల పాటు వైద్యాధికారులతో ఇతరశాఖల అధికారులు సమన్వ యంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను విజయవంతం చేశారు. జిల్లాలో 1.39 లక్షల మంది వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు.

– డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం

ఇంటింటా ఆరోగ్య సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలం టీర్లు, వైద్యసిబ్బంది సర్వే చేసి, అనారోగ్య సమస్యలున్న వారిని జల్లెడ పట్టారు. దీంతో పలు వ్యాధులు బయటపడ్డాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, కంటి సమస్యలు, టీబీ వ్యాధులు వెలుగులోకి వచ్చాయి. వారంతా ఇప్పుడు చికిత్స తీసుకునే పనిలో పడ్డారు. సకాలంలో తగిన వైద్యం చేసేందుకు ఈ సురక్ష తోడ్పడింది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు వైద్యశిబిరాలు ఉపయోగకరంగా మారాయి.

–నిశాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం



పార్వతీపురం మండలం ములగ గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి జగన్నాథరావు (ఫైల్)

సంక్షేమ సంతోషం

రూ.10లక్షల ఆస్తి



మేము నిరుపేదలం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దయవల్ల ఇంటిస్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి లక్షా 80వేలు మంజూరయ్యాయి. మా కాలనీకి విద్యుత్, తాగునీరు, రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. నాలుగేళ్ల కిందటివరకు అద్దె ఇళ్లలో మగ్గేవారం. ఇప్పుడు సొంతింటిలో సంతోషంగా ఉంటున్నాం. మాకు ప్రభుత్వం ఇచ్చిన స్థలం, ఇంటి విలువ సుమారు రూ.10లక్షలు. ఈ స్థాయిలో పేదలకు సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు మరిపుట్టడు. జగన్‌మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనిది.

– రెడ్డి లక్ష్మి, పెనుబాక, రాజాం మండలం

విద్యారంగంలో ఊహించని మార్పు



ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాను. ఇన్నేళ్ల కాలంలో ఏ ప్రభుత్వం సర్కారు బడులను ఈ స్థాయిలో బాగుచేయలేదు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల దశ, దిశ మార్చేశారు. దీనికి అన్నవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలే నిలువెత్తు నిదర్శనం. కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకుంది. విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఉపాధ్యాయులకు సైతం అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్ రెడ్డిదే.

– గవర ప్రసాదరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అన్నవరం, పాలకొండ మండలం

తిరగాల్సిన పని లేకుండా...



గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. బర్త్ సర్టిఫికెట్ కావాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాను ఫలితం దక్కలేదు. సరైన ధ్రువపత్రాలు లేక, సాంకేతిక కారణాల వల్ల నాకు ధ్రువ పత్రాలు అందలేదు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద వలంటీర్ రాంబాబు మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించాడు. మా వార్డులో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో పైసా ఖర్చులేకుండా బర్త్ సర్టిఫికెట్ అందజేశారు.

– అలజంగి జగదీశ్వరరావు, 19వ వార్డు, పార్వతీపురం

ఇంటి కల నెరవేరింది



మాకు సొంత ఇల్లు లేదు. నిర్మించుకునే ఆర్థిక స్తోమతా లేదు. గతంలో ఎంతోమంది కాళ్లుపట్టుకున్నా స్థలం మంజూరు చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎవరి సిఫార్సు లేకుండానే వైఎస్సార్ జగనన్న కాలనీలో స్థలం ఇచ్చారు. నిర్మాణానికి రాయితీపై సామగ్రితో లక్షా80వేల రూపాయలు అందజేశారు. ప్రభుత్వం మేలు మరిచిపోలేనిది. మాలాంటి పేదలను ఆదుకున్న ముఖ్యమంత్రి పదికాలాల పాటు చల్లగా ఉండాలి.

– రౌతు మేరిమ్మ, రాజ్యలక్ష్మీపురం, కొమరాడ మండలం

భారీ స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్

- నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోని గ్రౌండ్‌లో ఏర్పాట్లు
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు



విజయనగరం: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల19న (ఆదివారం) క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. దీనిని నగర ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్.ఎల్.ఎస్.రాజు, ట్రెజరర్ సీతారామరాజు శుక్రవారం తెలిపారు. నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ పక్కనున్న గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్రికెట్ ప్రేమికులు, క్రీడాకారులు, ప్రజలు, క్రీడాభిమానులు కార్యక్రమంలో పాల్గొని భారత్ క్రికెట్ జట్టు విజయానికి మద్దతు అందించాలని కోరారు.

ఓట్ల కోసం దిగజారుడు వ్యాఖ్యలా?

- మతిభ్రమించిన వ్యక్తిలా అశోక్ గజపతి అసంబద్ధ వ్యాఖ్యలు
- మళ్లీ టీడీపీ నేతల మాయమాటలతో ప్రజలు మోసపోరు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజాస్వామ్య విధానంలో రాజ్యాంగబద్ధంగా 151 స్థానాలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఖండించారు. ఇన్నాళ్లూ బంగ్లాకే పరిమితమైన ఆయన ఎన్నికలొస్తున్నప్పుడు బయటకొచ్చి కేవలం ఓట్ల కోసం దిగజారుడు మాటలు వల్లెవేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. కలెక్టరేట్ వద్ద జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినవెంకట అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టరు రేగాన శ్రీనివాసరావులతో కలిసి మీడియా సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేసిన చంద్రబాబును గజదొంగ అనక తప్పదన్నారు. అతన్ని సమర్థిస్తున్న టీడీపీ నాయకులూ దొంగలేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను అశోక్ వెనక్కి తీసుకోకపోతే దూషణలు తప్పవన్నారు.

అశోక్ చేసిందేమీ లేదు...

సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అశోక్ విజయనగరం ప్రజలకు చేసిందేమీ లేదని జెడ్పీ చైర్మన్ ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో చేసిందేమిటో చెప్పుకోవడానికి ఏమీ లేక, గత నాలుగేళ్లగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో, మంత్రి బొత్స సత్యనారాయణ తదితర నాయకుల కృషితో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అశోక్ మతిభ్రమించినవాడిలా దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. స్వయంగా కేంద్ర విమానయాన మంత్రిగా ఉన్నా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేసిందేమీ లేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఒక్క పైసా కూడా కేంద్రం నుంచి నిధు లు తేలేదని గుర్తు చేశారు. అన్నివిధాలా మోసం చేయబట్టే ప్రజలు ఓడించి బంగ్లాకు పంపించారని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో, కేంద్ర మంత్రిత్వశాఖలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేకసార్లు సంప్రదించి భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు సాధించారని చెప్పారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని, త్వరలోనే మీడియాను తీసుకెళ్లి చూపిస్తున్నామని వెల్లడించారు.

జగనన్నదే ఆ ఘనత...

ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక కోటీ 28 లక్షల ఇళ్లను మంజూరు చేస్తే అందులో సుమారు 30లక్షల ఇళ్లను మన రాష్ట్రానికి సాధించిన ఘనత జగనన్నకే దక్కుతుందని జెడ్పీ చైర్మన్ చెప్పారు. రాష్ట్రంలోని పేదలకు సుమారు రూ.15 వేల కోట్లతో స్థలాలు కొనుగోలు చేసి పట్టాలు ఇవ్వడమే గాక జగనన్న కాలనీల్లో మౌలిక వసతులన్నీ కల్పించిందని వివరించారు. ఆ రోజు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో భాగస్వాములై ప్రభుత్వంలో మంత్రి పదవులు అనుభవించీ అశోక్ సహా టీడీపీ నాయకులెవ్వరూ ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ చేపట్టలేదని విమర్శించారు.

స్వప్రయోజనాలే టీడీపీకి ముఖ్యం...

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం జిల్లాకు దక్కిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేవలం రియల్ ఎస్టేట్, స్వప్రయోజనాల కోసమే మైదాన ప్రాంతమైన కొత్తవలసలో పెట్టాలని చూశారని, అయినా శంకుస్థాపన కూడా చేయలేకపోయారని మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక గిరిజన ప్రాంతమైన సాలూరు నియోజకవర్గం పరిధిలో భూసేకరణ చేసి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తీసుకొచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయించారని గుర్తు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసుకొని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభంకానున్నాయని వెల్లడించారు.

మెడికల్ కాలేజీ వద్దన్నారే...

మాన్సాస్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ఆనంద గజపతిరాజు ముందుకొచ్చారని, ఆయన కీర్తిశేషులైన తర్వాత మాన్సాస్ చైర్మన్ పదవిలోకి వచ్చిన అశోక్ తమకు మెడికల్ కాలేజీ అక్కర్లేదంటూ స్వదస్తూరీతో తిరస్కరించిన విషయాన్ని మరచిపోలేమని జెడ్పీ చైర్మన్ అన్నారు. నీతిమంతులమంటూ ఓట్లు అడుగుతున్న అశోక్‌పైనా అవినీతి ఆరోపణలు వచ్చిన విషయం జగద్విితమేనన్నారు.

అభివృద్ధిని ఓర్వలేని అశోక్...

శాసనసభ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో విజయనగరంలో, మంత్రి బొత్స సత్యనారాయణతదితర నేతల కృషితో జిల్లాలో గతంలో ఎన్నడూలేనంతగా జరుగుతున్న అభివృద్ధిని చూసి అశోక్ ఓర్వలేకపోతున్నారని జెడ్పీ చైర్మన్ ఎద్దేవా చేశారు. ఆయన దృష్టిలో అభివృద్ధి అంటే ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఢిల్లీలో తిష్టవేయడం, సొంత మనుషుల పనులు చక్కబెట్టుకోవడమేనని విమర్శించారు. విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎన్‌టీ రామారావు హయాంలో ప్రతిపాదించిన తారకరామతీర్థ సాగర్‌ప్రాజెక్టును వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లిందని గుర్తు చేశారు. కానీ తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం దాన్ని పూర్తిగా పక్కనబెట్టిందని విమర్శించారు. ఇన్నాళ్లకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే ఆ ప్రాజెక్టును పూర్తిచేయడానికి నడుంబిగించారని చెప్పారు.

మళ్లీ ప్రజలు మోసపోరు...

ఏం చేశారని టీడీపీ నాయకులపై తమకు కక్ష ఉంటుందని మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దోచుకొని చంద్రబాబు జైలుకెళ్లారని, ఆయన్ను సీఐడీ అరెస్టు చేసిందని, కోర్టు విచారిస్తుందని చెప్పారు. సానుభూతి ముసుగులో ఓట్ల కోసం మళ్లీ మాయమాటలు చెబితే ప్రజలు నమ్మరని, మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరని అన్నారు.

మన్యం గజగజ



మన్యంలో కురుస్తున్న పొగ మంచు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలితీవ్రత
- సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త అంటున్న వైద్యులు

సీతంపేట: మన్యంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. మన్యంలో చలి తీవ్రత పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మంచుకురుస్తోంది.

సీతంపేట ఏజెన్సీలో నాలుగు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)

తేదీ	పగలు	రాత్రి
14	29	19
15	27	20
16	29	18
17	28	19

ఈ కాలంలో వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న పాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల ప్రభావం నుంచి గట్టెక్కవచ్చంటున్నారు.

జాగ్రత్తలు పాటిద్దాం...

- ప్రతిరోజు కనీసం 20 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- తెల్లవారు జామున 5 నుంచి 6 గంటల మధ్య జాగింగ్ చేయకపోవడం మంచిది. కాస్తా ఎండ వచ్చిన తర్వాత వ్యాయామం చేస్తే మంచు నుంచి రక్షణ పొందవచ్చు.
- తలకు స్కార్ఫ్, మంకీ టోపీ వంటివి ధరించి చెవుల్లో దూదిపెట్టుకోవాలి.
- వాకింగ్ చేసేవారు బూట్లు, సాక్సులు, బైక్‌లు నడిపేవారు గ్లౌవ్స్ ధరించాలి. శరీరం మొత్తం కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- వృద్ధులు, పిల్లలు, చల్లని వాతావరణంలో తిరగకూడదు. మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు మందులు విధిగా వాడాలి. దగ్గు, జలుబు మూడు రోజులకు మించి తగ్గకుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలు వస్తాయి. సోరియాసిస్ సమస్యతో బాధపడేవారికి ఎలర్జీ వచ్చే అవకాశం ఉంది. మందులు క్రమం తప్పకుండా వాడాలి.
- గ్లిజరిన్ సబ్బులు వాడడం మంచిది.
- కొబ్బరినూనె, ఆలివ్‌ఆయిల్, వెన్న ఒంటికి రాసుకుని ఆ తర్వాత స్నానం చేయడం మంచిది. అలా చేయడం వల్ల చర్మంతో తేమ నిల్వ ఉంటుంది.
- సబ్బులు బదులు సున్నిపిండి, పెసరపిండి వాడితే శరీరం పొడిబారకుండా ఉంటుంది.
- దాహం వేయకపోయినా సమృద్ధిగా నీరు తాగాలి.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. స్నానం చేసే నీటిలో రెండు చెంచాల నూనెను వేసి చేస్తే ప్రయోజనం ఉంటుంది. తలస్నానానికి ముందు నూనె పెట్టుకోవాలి. చలికాలంలో తలకు రంగు వేయడం వలన కురులు మాయిశ్చర్ కోల్పోయి పొడిగా మారే ప్రమాదముంది.
- చేతులు, పాదాలు పగిలితే గోరు వెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పువేసిన పాత్రలో ఉంచి తరువాత పొడి బట్టతో తుడుచుకోవాలి.

ఆహార జాగ్రత్తలు ఇలా..

- జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. శుభ్రమైన ఆహారంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలి.
- రోగనిరోధక శక్తి పెంచే విటమిన్-సి సమృద్ధిగా ఉండే ఆహారం తినాలి. జింక్ ఉండే బాదం వంటి వాటిని, ఇన్‌ఫెక్షన్లతో పోరాడే ప్రో బయోటిక్ ఎక్కువగా ఉన్న పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- సీజన్‌లో దొరికే అన్ని పండ్లు తీసుకోవచ్చు. జామ, దానిమ్మ, బొప్పాయి, అరటిపండ్లు తీసుకోవచ్చు. వీటిలో విటమిన్-సి ఎక్కువగా ఉండి జలుబు, ఫ్లూ వంటి సమస్యల నుంచి కాపాడుతుంది.
- నల్ల ద్రాక్ష తీసుకుంటే చర్మ సంరక్షణకు దోహదపడుతుంది. వీటిలో యాంటీ యాక్సిడెంట్స్ శరీరానికి మేలు చేస్తాయి.

చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైనంతవరకు చలిలో రాకపోకలు చేయరాదని, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచులో తిరగకుండా ఉండాలి. ఒక వేల బయటకు వెళ్లాల్సి వస్తే తల, శరీరం కప్పి ఉండేలా ఉన్ని దుస్తులు ధరించాలి. ప్రతిఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదముంది. కూల్ డ్రింకులు, ఐస్‌క్రీమ్‌లు వంటివి పూర్తిగా తీసుకోవద్దు.

– బొడ్డేపల్లి శివకుమార్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, సీతంపేట ఏరియా ఆస్పత్రి



చలికి మంట కాగుతున్న గిరిజనులు

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్

తెర్లాం: మండలంలోని కూనాయ వలసలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామంలోని కొందరి రైతులకు సంబంధించిన పొలాలకు మోటార్ల కోసం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌పై కన్నేసిన దొంగలు దానికి సరఫరా అవుతున్న విద్యుత్‌ను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేసినట్లు ఈపీడీసీఎల్ ఏఈ జోగినాయుడు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పవర్ కట్ చేసిన దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దించి అందులో నిక్షిప్తమై ఉన్న రూ.3.50లక్షల విలువైన రాగి, ఇతర భాగాలను చోరీ చేసి ఖాళీ పెట్టెను అక్కడే వదిలేసి పోయారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పూరిల్లు దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న ప్రజలు

గరుగుబిల్లి: మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన ఆర్.గవరయ్య ఇంటిలో ప్రమాదవశాత్తు మంటలు రావడంతో ఇల్లు అంటుకుంది. దీంతో గ్రామస్తులు వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న సామగ్రి, పత్రాలు పూర్తిగా కాలిపోవడంతో గవరయ్య లబోదిబోమంటున్నాడు. అధికారులు స్పందించి తనకు జరిగిన నష్టాన్ని పరిశీలించి పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

కాలిపోయిన పైపులు


అగ్నిప్రమాదంలో కాలిపోతున్న పైపులు

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో 375 గృహాలకు జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటిని పంపిణీ చేసేందుకు సర్పంచ్ మాచర్ల మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెంకటరమణలు శుక్రవారం భూమి పూజచేశారు. రూ.40 లక్షల వ్యయంతో ఇంటింటికీ తాగునీటిని ఇచ్చేందుకు పనులు ప్రారంభించి కుళాయి పాయింట్లు ఇచ్చేందుకు నెలక్రితం తెప్పించిన సుమారు రూ.13 లక్షల విలువ గల ప్లాస్టిక్ పైపులను ఊరు చివర గడ్డివాముల సమీపంలో డంపింగ్ చేశారు. అయితే శుక్రవారం నాగులచవితి కావడంతో పుట్టలో పాలుపోసేందుకు వెళ్లినవారు ఎవరో క్రాకర్స్ వెలిగించారు. దీంతో గడ్డివాముకు నిప్పు అంటుకుని పక్కనే ఉన్న తాగునీటి పైపులు కాలిపోయాయి. సమాచారం మేరకు వెంటనే పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.6 లక్షల విలువైన పైపులు కాలిపోయాయని అధికారులు అంచనా వేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి ఎస్సై ఎంపీ రమణ చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

బత్తిలి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మాన్‌రావు, రెవెన్యూ సిబ్బంది

భామిని: మండలంలోని బత్తిలి పాత సినిమా హాల్ సమీపంలో పంటపొలాల గట్టుపై గుర్తు తెలియని మృతదేహాన్ని ఎస్సై యతిరాజుల అమ్మాన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుండి 45 ఏళ్లు ఉండవచ్చని దివ్యాంగుడి మృతదేహంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి శరీరంపై నల్లని నిక్కరు ఉందని, శరీరం కుళ్లికృశించి పోయి ఎముకలు బయకు కనిపిస్తున్నాయని చెప్పారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతుని వివరాలపై లుకౌట్ నోటీసులు విడుదల చేసి వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై అమ్మానరావు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబర్లు 6309990884, 9490595599కు తెలియజేయాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

అదిగదిగో ఉపాధి



జిందాల్ అల్యూమినా రిఫైనరీ ఏర్పాటు కోసం గతంలో సేకరించిన స్థలం

- ఎస్.కోటలో కొత్త అవకాశాలు
- ఏర్పాటు కానున్న ఎంఎస్‌ఎంఈ పార్క్
- రాయితీలు ఇచ్చేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- వేలాదిమందికి దొరకనున్న ఉద్యోగాలు

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో కొత్త ఉపాధికి బాటలు పడుతున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేసి, స్థానికంగా ఉన్న వేలాదిమంది యువతకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రతిపాదనలతో ముందుకొచ్చిన జిందాల్ కంపెనీకి తమవంతు సహకారం అందిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చింది. జిందాల్ యాజమాన్యం అడిగిన రాయితీలు అందించేందుకు అంగీకరించింది. రాయితీలను భరించైనా యువతకు ఉపాధి మార్గం చూపడమే లక్ష్యంగా సర్కారు యత్నిస్తోంది.

ముందుకొచ్చిన జిందాల్

2008లో ఎస్.కోట మండలంలోని అల్యూమినా రిఫైనరీ కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు జిందాల్ కంపెనీ సిద్ధమైంది. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి సర్కారు 985.70ఎకరాల భూమిని కేటాయించింది. తర్వాత అల్యూమినా రిఫైనరీ కర్మాగారానికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు రాకపోవడంతో రిఫైనరీ ఏర్పాటును జిందాల్ విరమించుకుంది. దీంతో ప్రభుత్వం కేటాయించిన భూమి నిరుపయోగంగా ఉంది. ఇటీవల జిందాల్ తమకు కేటాయించిన స్థలంలో యువత ఉపాధి కోసం 1166 ఎకరాల్లో రూ.531.36కోట్ల పెట్టుబడులతో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

యువత ఉపాధే సర్కారు లక్ష్యం

జగన్‌మోహన్ రెడ్డి సర్కారు ప్రధానంగా యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ఎంఎస్‌ఎంఈ ఏర్పాటుకు అనుమతినిస్తూ జిందాల్ కోరిన రాయితీలు ఇచ్చేందుకు ఓకే చెప్పింది. జిందాల్ భూసేకరణలో ఉపాధి కోల్పోయిన కుటుంబాలు, స్థానికంగా ఉన్న వేలాదిమంది యువతకు జిందాల్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పార్కు రావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రత్యక్షంగా 15వేల మంది, పరోక్షంగా మరో 10వేల మందికి ఉపాధి దారి దొరకనుంది. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, రవాణా అనుబంధ రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయి.

ఇదీ సీఎం విజన్



జిందాల్ భూసేకరణలో అక్రమాలు జరిగిపోయాయంటూ నానా యాగీ చేసిన చంద్రబాబు అండ్ కో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిందాల్‌పై పెదవి విప్పలేదు, సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. ఇప్పుడు యువత ఉపాధి కోసం జిందాల్ కోరిన రాయితీలు కల్పించైనా ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభించాలనే పట్టుదలతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఉన్నారు.

– కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే. ఎస్‌కోట

మంచి ఆలోచన :



జిందాల్ కోసం వందల ఎకరాల భూములు ఇచ్చి ఉపాధి లేక చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎట్టకేలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో జిందాల్ ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఈది చాలా సంతోషించాల్సిన విషయం. దీనివల్ల జిందాల్ నిర్వాసితులకు ఉద్యోగం, ఉపాధి లభిస్తాయి. మా ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

–దేవాపురపు మీనా, బొడ్డవర సర్పంచ్

చక్కని ప్రయత్నం



జిందాల్ కంపెనీ వస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశపడ్డాం. కానీ అది జరగలేదు. ఇప్పటికైనా ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామని జిందాల్ ముందుకు రావడం సంతోషం. పార్కు వస్తే ఈప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

–డి.శంకర్, బొడ్డవర

వృద్ధుడి ఆత్మహత్య

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలసకు చెందిన ఏడాకుల రామయ్య(77) చీమలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామయ్య భార్య ఆరు నెలల క్రితం చనిపోయింది.దీంతో ఆయన ఆలనాపాలనా చూసేవారు కరువవడంతో మనస్తాపం చెంది ఈనెల 15న చీమల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 16వ తేదీ రాత్రి మరణించాడు. మృతుడి పెద్ద కుమారుడు సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంపీ రమణ తెలిపారు.

అండర్-19 ఆంధ్రా క్రికెట్ జట్టు మేనేజర్‌గా బంగార్రాజు


పి.బంగార్రాజు

విజయనగరం: అండర్-19 విభాగంలో బీసీసీఐ నిర్వహించే కుచ్ బెహర్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా క్రికెట్ జట్టు మేనేజర్‌గా విజయనగరానికి చెందిన మాజీ క్రీడాకారుడు పి.బంగార్రాజు నియమితులయ్యారు. ఈ నెల 17 నుంచి వచ్చేనెల 18 వరకు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ టోర్నీ జరగనుంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, బీహార్, జార్ఖండ్ రాష్ట్ర జట్లతో ఆంధ్రా జట్టు తలపడనుంది. జట్టు మేనేజర్‌గా ఎంపికైన బంగార్రాజును జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్.ఎన్.రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, జిల్లా సెలెక్టర్లు వర్మ, సర్వరాజ్‌తో పాటు క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

ధాన్యం సేకరణపై అపోహలు సృష్టిస్తే చర్యలు

- మద్దతు ధరకే రైతులు విక్రయించాలి
- కలెక్టర్ నిషాంత్ కుమార్



మావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో పండిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ధాన్యం సేకరణకు పూర్తి ఏర్పాట్లు చేశామని, ధాన్యం సేకరణపై అపోహలు, వదంతులు సృష్టించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు ధాన్యం సేకరణపై అధికారులు, మిల్లర్లు, లారీ సంఘం ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.23 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి అంచనా వేశామని, రైతులు వారి ధాన్యాన్ని జిల్లాలో ఏర్పాటు చేసిన 185 కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించవచ్చని తెలిపారు. రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువకు విక్రయించవద్దని సూచించారు. రైతులను ప్రలోభపెట్టి, ఇబ్బందిపెట్టి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రం స్థాయిలో వలంటీర్లతో సమావేశం ఏర్పాటుచేసి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో మొదటి పదిరోజులు కీలకమని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని అంచనా వేసి ముందుగా ఏర్పాట్లు చేయాలని పిలుపునిచ్చారు. ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, రైతుల నుంచి ఫిర్యాదులు లేకుండా సివిల్ సప్లయిస్, రవాణా, వెలుగు, జీసీసీ, వ్యవసాయ, సహకారశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, ఆర్‌డీఓలు కె.హేమలత, ఎం.లావణ్య, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్, వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

- ఫారం 6, 7, 8లను పరిష్కరించాలి
- ఎన్నికల సిబ్బందికి సూచించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని, 18 ఏళ్లు దాటిన వారి ఓటు నమోదు శాతం పెరగాలని, ఓటర్ల సవరణ ప్రక్రియలో వచ్చిన ఫారం 6, 7, 8లను 15 రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. 15 రోజులు దాటి దరఖాస్తుకు పరిష్కారం చూపనివారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శుక్రవారం మాట్లాడారు. 6, 7, 8 క్లెయిమ్‌ల పరిష్కారం, ఓటర్లు జనాభా నిష్పత్తి, స్త్రీ పురుష ఓటర్ల నిష్పత్తి, ఎపిక్ కార్డుల జనరేషన్, వార్తా పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తలపై చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. అనామోలిస్ ఫారాలన్నీ నవంబర్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 18, 19 సంవత్సరాల ఓటర్ల సంఖ్య జిల్లాలో తక్కువగా ఉందని, అర్హతగల యువకులు 6,800 మందిని తక్షణమే ఓటర్లుగా చేర్పించాలన్నారు. వచ్చే వారం రోల్ అబ్జర్వర్ శ్యామలరావు జిల్లాలో పర్యటించనున్నారని, బీఎల్‌ఓలందరూ వారి వద్ద ఉన్న రిజిస్టర్లన్నీ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ నెలలో రెండు రోజులపాటు ఎన్నికల కమిషన్ అధికారులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో అనిత, ఈఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, సుధారాణి, సూకరాజు, ఎన్నికల విభాగం ఏఓ శ్రీకాంత్, డీటీలు పాల్గొన్నారు.


పాల్గొన్న మండల స్థాయి అధికారులు

ఇదెక్కడి చోద్యం..!

- ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాకం
- ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రోగి తరలింపు
- డీఎంహెచ్‌ఓకు 108 సిబ్బంది ఫిర్యాదు

విజయనగరం ఫోర్ట్: సినీఫక్కీ తరహా ఘటన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శుక్రవారం జరిగింది. 108 అంబులెన్సులో వచ్చిన రోగిని ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు బలవంతంగా తన వాహనంలో తరలించుకుపోయాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదంలో తలకు గాయం కావడంతో పైడిరాజు అనే వ్యక్తి చికిత్స కోసం చీపురపల్లి సీహెచ్‌సీలో చేరాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేయగా 108 అంబులెన్సులో సిబ్బంది రోగిని సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే సర్వజన ఆస్పత్రి గేటు వద్ద కాపుకాసిన ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు ఒకరు 108 అంబులెన్సు ఆస్పత్రి క్యాజువాలిటీ వద్దకు రాగానే లోపలికి ప్రవేశించి రోగిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించాడు. ఎందుకు ఆరోగిని తరలిస్తున్నావు? మేము ఆస్పత్రిలో చేర్చాలని 108 సిబ్బంది చెప్పగా, ఆ పేషెంట్ తమ పేషెంట్ అని వాదులాడి ఇక్కడితో మీ పని అయిపోయింది. నేను పేషెంట్‌ను తీసుకుని వెళ్తాను. ఏం చేసుకుంటారో? చేసుకోండంటూ పేషెంట్‌ను ప్రైవేట్ అంబులెన్సులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయాడు. దీంతో 108 సిబ్బంది బి.రవికుమార్, ఎస్.వేణుగోపాల్‌రావులు ఈ విషయమై డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి ఆర్‌ఎంఓకు ఫిర్యాదు చేశారు. ఇదేవిషయాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓ సురేష్‌బాబు వద్ద సాక్షి ప్రస్తావించగా క్యాజువాలిటీ ఆవరణ వద్దకు రాగానే ప్రైవేట్ అంబులెన్సు నిర్వాహకుడు పేషెంట్‌ను తన అంబులెన్సులో తరలించినట్లు 108 సిబ్బంది చెప్పారని, ఈ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సర్వజన ఆస్పత్రిలోకి ప్రైవేట్ అంబులెన్స్‌లు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వేడుకగా 'సుందర్ స్కైలాంజ్' బ్రోచర్ ఆవిష్కరణ


మధురవాడలో వైశాఖీ వెంచర్ సుందర్ స్కైలాంజ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, తదితరులు

మధురవాడ (భీమిలి): ప్రముఖ గృహ నిర్మాణ సంస్థ వైశాఖీ నూతన వెంచర్ 'సుందర్ స్కైలాంజ్' బ్రోచర్‌ను మధురవాడ రెవెన్యూ కాలనీలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వీడియోను రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ఆవిష్కరించారు. నిర్మాణ సంస్థకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైశాఖీ సంస్థ అధిపతులు బలుసు విద్యాసాగర్, బలుసు రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు 30 అంతస్తుల్లో గేటెడ్ కమ్యూనిటీగా చేపడుతున్నామన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త డిజైన్, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అస్థి పంజరం కలకలం


లభ్యమైన పుర్రె, ఎముకలు

పాచిపెంట: మండలంలోని పణుకు వలస పంచాయతీ చిన చీపురువలస సమీపంలోని పంచ మాను జోరు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి అస్థి పంజరం శుక్రవారం కలకలం రేపింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆయా గ్రామాల సమీపంలో ఉన్న కొంతమంది మేకల కాపరులు మేకలు మేపుతున్న సమయంలో ఓ వ్యక్తి అస్థిపంజరాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వెంటనే చేరుకుని అస్థిపంజరాన్ని పరిశీలించి పంచనామా చేశారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు.

హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: భార్యను హతమార్చాడన్న అభియోగం రుజువు కావడంతో సాలూరు పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన ముద్దాయి సొంపి లక్ష్మణరావుకు జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసుపై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణరావుకు 17 ఏళ్ల క్రితం సన్యాసమ్మతో వివాహం జరిగింది. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు ఇటీవల పని మానేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు భార్యను అనుమానించసాగాడు. ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 28న భార్యతో గొడవ పడగా కుటుంబసభ్యుల జోక్యంతో సద్దుమణిగింది. మరునాడు భార్య తన కుటుంబసభ్యులతో కలిసి మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా లక్ష్మణరావు కత్తితో ఆమెను పొడిచి పరారయ్యాడు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతిచెందింది. హతురాలి కుమారుడు యేసువర్ధన్ ఫిర్యాదు మేరు సాలూరు సీఐ కేసు నమోదు చేసి నిందితుడు లక్ష్మణరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

చవితి శోభ

విజయనగరం జిల్లా ప్రజలు నాగులచవితి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఇంటిల్లపాదీ కొత్తదుస్తులు ధరించి పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకున్నారు. పుట్టల్లో పాలు, గుడ్లు వేసి పూజలు చేశారు. చలివిడి ముద్దలను నైవేద్యంగా సమర్పించారు. చవితి పూజలతో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ కనిపించింది.

– సాక్షినెట్‌వర్క్


దత్తిరాజేరు: గుచ్చిమి గ్రామంలో పుట్టలో పాలుపోస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో పుట్ట దగ్గర పూజలు చేస్తున్న భక్తులు


చీపురుపల్లి: అలజంగి సమీపంలోని తోటలో నాగదేవతకు పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు


గుమ్మలక్ష్మీపురం: కేదారిపురంలో పుట్ట వద్ద భక్తుల పూజలు